# పుట్టినగడ్డ రుణం తీర్చుకోవడం అభినందనీయం



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డితో అమెరికన్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి
- బాన్సువాడ దవాఖానకు ఆటా ఆధ్వర్యంలో ఆర్వోప్లాంట్, ఈసీజీ మిషన్ విరాళం
- తెలంగాణ తిరుమలలో సంస్థ ప్రతినిధుల ప్రత్యేక పూజలు

బాన్సువాడ టౌన్, డిసెంబర్ 14 : ప్రవాస భారతీయులు పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడం అభినందనీయమని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ సారి బాన్సువాడ వంద పడకల మాతా-శిశు దవాఖానకు ఆర్వో ప్లాంట్, ఈసీజీ మిషన్‌ను ఎమ్మెల్యే పోచారం చేతుల మీదుగా గురువారం దవాఖాన సూపరింటెండెంట్‌కు అసోసియేషన్ సభ్యులు అందజేశారు. ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ జన్మభూమి రుణం తీర్చుకోవాలన్న ఆశయంతో తమ సంపాదనలో కొంత మొత్తాన్ని ఖర్చు చేసి, పేద ప్రజల సౌకర్యార్థం బాన్సువాడ మాతా-శిశు దవాఖానలో మంచినీటి శుద్ధి యంత్రం, ఈసీజీ యంత్రాన్ని ఏర్పాటు చేసిన ఆటా సభ్యులకు, జనహిత సంస్థ నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. బాన్సువాడ మాతా-శిశు కేంద్రంలో హైదరాబాద్ కార్పొరేట్ దవాఖానలకు తీసిపోని విధంగా అన్ని సౌకర్యాలను కల్పించామన్నారు. దీంతో దేశంలోనే అత్యున్నత పురస్కారం అయిన కాయకల్ప అవార్డు ఐదు సార్లు, లక్ష్య అవార్డు రెండుసార్లు వచ్చిందని, అంతేకాకుండా బ్రెస్ట్ ఫీడింగ్ ఏకో అవార్డు అందుకున్న ఏకైక ప్రభుత్వ దవాఖానగా బాన్సువాడ మాతా-శిశు దవాఖాన నిలిచిందని తెలిపారు. బాన్సువాడ పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఏరియా దవాఖాన, మాతా-శిశు కేంద్రాలను అనుసంధానం చేయడానికి స్టీల్ బ్రిడ్జిని నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఆటా చైర్మన్ ఎలక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా, కార్యదర్శి రామకృష్ణారెడ్డి, దాతలు డాక్టర్ హిమబిందు రెడ్డి, బోడ అశ్వినీ రెడ్డి, జనహిత సంస్థ నిర్వాహకులు ఆర్. సతీష్ రెడ్డి, బోడ రఘుపతి రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు ఎజాజ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, కౌన్సిలర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి, ఆరోగ్య జ్యోతి, శాంతాకుమారి, మల్లీశ్వరి, సుబ్బాయమ్మ, స్థానిక నాయకులు, దవాఖాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ తిరుమలను దర్శించుకున్న ఆటా ప్రతినిధుల**

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవడానికి వచ్చిన అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) సభ్యులు బీర్కూర్ మండలం తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పోచారం దగ్గరుండి ఆలయం గురించి వివరించారు.

# నిజాంసాగర్ నీటి విడుదల



నిజాంసాగర్ ప్రాజెక్టు

- యాసంగి సాగుకు ఆరు విడుతలుగా..
- ఏప్రిల్ వరకు 11 టీఎంసీల నీటి విడుదలకు నిర్ణయం

నిజాంసాగర్, డిసెంబర్14: యాసంగి పంటల సాగు కోసం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటి విడుదలను గురువారం ఉదయం ప్రారంభించారు. ప్రధాన కాలువ ద్వారా వెయ్యి క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ ఏఈ శివకుమార్ తెలిపారు. నీటి విడుదల నిర్ణయాన్ని ఈనెల 13న హైదరాబాద్‌లో ఈఎన్‌సీ మురళీధర్‌రావు నేతృత్వంలో జరిగిన శివం కమిటీ సమావేశంలో తీసుకున్నారు. ఈ నిర్ణయం మేరకు ఆయకట్టు కింద నిజాంసాగర్ నుంచి అలీసాగర్ వరకు లక్షా 25వేల ఎకరాలకు 11 టీఎంసీల నీటిని ఏడు విడుతల్లో ఏప్రిల్ వరకు విడుదల చేయనున్నట్లు తీర్మానించినట్లు తెలిపారు.

ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 1405.00 అడుగుల (17.80 టీఎంసీలు) కెపాసిటీకి గాను 1403.86 అడుగుల (16.16 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు. ఆయకట్టు రైతుల అవసరాలకు అనుగుణంగా నీటి విడుదల హెచ్చుతగ్గులుగా విడుదల చేయనుండగా పది రోజులకు ఒక తడి చొప్పున నీటిని విడుదల చేసి పది రోజులు గ్యాప్ ఇస్తూ ఏడు విడుతల్లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఆయకట్టు రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని వృథా చేయవద్దని సూచించారు. జీరో డిస్ట్రిబ్యూటరీ నుంచి 49 డిస్ట్రిబ్యూటరీ వరకు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగిస్తూ నీటి విడుదల చేయనున్నామని పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం



ఎమ్మెల్సీ కవితతో రూరల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు

- అధికారం కోల్పోయామని అధైర్యపడొద్దు
- నిత్యం అందరికీ అందుబాటులో ఉంటా
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 14 : అధికారం కోల్పోయామని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఎంపీపీలు, బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవిత, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను బుధవారం రాత్రి వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా కవిత ఎంపీపీలకు, నాయకులకు, కార్యకర్తలకు పలు సలహాలు, సూచనలు చేశారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ హయాంలో ఊహించని విధంగా అభివృద్ధి చేశారన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీ అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు కైవసం చేసుకొని హ్యాట్రిక్ సీఎంగా కేసీఆర్ అవుతారని అందరం ఆశించినప్పటికీ తిరిగి అధికారంలోకి రాకపోవడం చాలా బాధాకరమన్నారు. ప్రజాతీర్పును ఎవరైనా శిరసావహించాల్సిందేనన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నిక ల్లో అత్యధిక బలగమున్న బీఆర్ఎస్ శ్రేణులందరూ అంతర్గతంగా ఏవైనా విభేదాలుంటే వాటిని విడనాడి, కలిసికట్టుగా కృషి చేసి అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని సత్తాను చాటాల్సిన అవసరముందన్నారు. తాను కూడా జిల్లా ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. అమలుకు సాధ్యం కానీ హామీలను ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా బలమైన ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమష్టి పోరాటం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ కవిత, బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసిన వారిలో ఎంపీపీలు అనుషాప్రేమ్ దాస్, లతా కన్నీరాం, నల్ల సారికాహన్మంత్‌రెడ్డి, రమేశ్‌నాయక్, విమలా రాజు, సంగీతా రాజేందర్, నాయకులు రాజన్న ఉన్నారు.





యశోదా దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జిల్లాకు చెందిన పలువురు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను పరామర్శించిన వారిలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎన్నారై సెల్ కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల తదితరులు ఉన్నారు.

# కంగ్రాట్స్ సార్..







అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, భూపతిరెడ్డి, మదన్‌మోహన్‌రావు తదితరులు స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.